సేవలకు కేరాఫ్ సచివాలయాలు

- అందుబాటులో 500లకుపైగా సేవలు
- గ్రామాల్లోనే సేవలు అందుతుండటంపై ప్రజల హర్షం



కదిరేపల్లిలో గ్రామ సచివాలయం

మడకశిరరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ/వార్డు సచివాలయాలు సేవలకు ప్రతి రూపంగా నిలుస్తున్నాయి. ప్రజలు గ్రామం దాటకుండానే అన్ని సేవలు అందిస్తూ బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజానికి నిదర్శనంగా మారాయి. మడకశిర నియోజకవర్గంలో మొత్తం 75 గ్రామ/వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశారు.

సులువుగా సచివాలయ సేవలు

గ్రామ వార్డు సచివాలయాల ద్వారా దాదాపు 540పై రకాల ప్రభుత్వ సేవలు అమల్లోకి తీసుకొచ్చారు. ఇందులో సాంకేతిక కారణాల వల్ల కొన్నింటికి అవాంతరాలు ఎదురు కావడం వల్ల 500పైగా ప్రభుత్వ సేవలు సులభంగా ప్రజలకు అందుతున్నాయి. పింఛన్, కుల నివాస, ఆదాయ సర్టిఫికెట్లు, కొత్త రేషన్‌కార్డుల్లో పేరు చేర్చడం, తొలగించడం, విద్యుత్ కనెక్షన్, బిల్లులు చెల్లింపు, పట్టాదారు పాస్తుకాలు, వన్‌-బీ , ఆరోగ్యశ్రీ,కొళాయి పన్నుల చెల్లింపు వంటి అనేక సేవలు సచివాయల్లో లభిస్తున్నాయి. గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలను ప్రతి ఒక్కరికీ తెలిసే విధంగా డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా సంక్షేమ పథకాల ద్వారా ఎంత మంది లబ్ధి పొందారు, ఎంత మంది నగదు డీబీటీ, బీబీటీ ద్వారా చేరిందనే అంశాలు బోర్డుల్లో ఉంచి సంక్షేమ పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యత కల్పించారు.

మడకశిర నియోజకవర్గంలో సచివాలయాలు

మండలం	సచివాలయాల సంఖ్య
మడకశిర	18
రొళ్ల	11
గుడిబండ	15
అగళి	11
అమరాపురం	14
మడకశిర మున్సిపాలిటీ	06
మొత్తం	75

సచివాలయ సేవలు అభినందనీయం



సచివాలయాలు అందిస్తున్న సేవలు అభినందనీయం . ఏ పని కావాలన్నా సచివాలయంలోనే పరిష్కారమవుతోంది. ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి తప్పింది. ప్రభుత్వ పథకాలకు గ్రామ సచివాలయంలోనే ఎలాంటి ఇబ్బంది లేకుండా దరఖాస్తు చేసుకుంటున్నాం. అర్హత ఉంటే మధ్యవర్తుల ప్రమేయం లేకుండా మంజూరవుతున్నాయి.

– వెంకటేష్, ఆర్ అనంతపురం, మడకశిర మండలం

పైసా ఖర్చు లేకుండా సర్టిఫికెట్లు



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా తమకు కుల, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్లను కదిరేపల్లి గ్రామ సచివాలయంలో ఉచితంగా అందించారు. గతంలో సర్టిఫికెట్ పొందాలంటే రెండు, మూడు రోజులు మండల కేంద్రంలో కార్యాలయం చుట్టూ తిరగాల్సి ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. – జయమ్మ, కదిరేపల్లి మడకశిర మండలం

క్లుప్తంగా

పీఎంజేజేవై చెక్కు అందజేత


బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న చీఫ్ పోస్టుమాస్టర్ ప్రకాష్

హిందూపురం: హెడ్ పోస్టాఫీసులో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజన(పీఎంజేజేవై) చెక్కును చీఫ్ పోస్టుమాస్టర్ ప్రకాష్ బాధిత కుటుంబానికి అందజేశారు. మోడల్‌కాలనీకి చెందిన షేక్ ఇస్మాయిల్ 2022 సెప్టెంబర్‌లో పీఎంజేజేవై కింద రూ.330 ప్రీమియం చెల్లించారు. గతేడాది నవంబర్‌లో అతడు మరణించాడు. దీంతో పీఎంజేజేవై కింద రూ.2 లక్షలు మంజూరైంది. ఈమేరకు గురువారం ఇస్మాయిల్ భార్య ముబిశిరకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్‌పీ కళ్యాణ్‌రామ్, పీఎం రహమతుల్లా పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

31న బెంగళూరులో వైఎస్సార్‌సీపీ సమావేశం

మడకశిర: బెంగళూరులో నివాసముండే మడకశిర నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమావేశాన్ని ఈనెల 31న ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్లు మడకశిర అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశాన్ని బెంగళూరు సిటీలోని ఎంఎస్‌రామయ్య లేఅవుట్, నాగసంద్ర మెట్రోస్టేషన్ వద్ద స్థానిక మాజీ ఎమ్మెల్యే మంజునాథ్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తనతో పాటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ, పార్టీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి, మడకశిరకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. బెంగళూరులో ఉండే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఓటుపై అవగాహన ర్యాలీ


బైకు ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించడానికి రంగసముద్రం, వదనకల్లు, సాసలకుంట పంచాయతీ పరిధిలో స్వీప్ సమితి ఆధ్వర్యంలో గురువారం బైక్ ర్యాలీ చేపట్టారు. పంచాయతీ అధికారులు ఓటు ప్రాముఖ్యతను తెలియజేశారు. టీపీ డీడీ రంగనాథ్, పీడీఓ లు, సిబ్బంది, సంజీవిని సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శుభకార్యం


వివాహ వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఉషశ్రీ దంపతులు

గోరంట్ల: వడిగేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత రామాంజిరెడ్డి కుమార్తె వివాహం మల్లాపల్లి రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగింది. శిశు సంక్షేమశాఖ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ దంపతులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫకృద్దీన్ సాహెబ్, మల్లాపల్లి సర్పంచ్ శివానంద, నార్పింపల్లి మాజీ సర్పంచ్ శివారెడ్డి, గోరంట్ల ఉప సర్పంచ్ రాజారెడ్డి, నాయకులు, నాగేనాయక్, జయచంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శంకరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఈరలక్కప్ప

గుడిబండ: జంబులబండ గ్రామంలో గురువారం కేకాతి గ్రామానికి చెందిన నాగేంద్ర వివాహం జరిగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, నాయకులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ శివకుమార్, జెడ్పీటీసీ భూతరాజు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

అమరాపురం: స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ, మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ఎన్నికల పరిశీలకులు పోకల అశోక్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి హాజరవుతారన్నారు. అనంతరం వీరశైవ కల్యాణ మంటపంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

వీధి వ్యాపారులకు గొడుగుల వితరణ


గొడుగులు అందుకున్న వ్యాపారులు

పావగడ: ఎండల తీవ్రతకు పెరిగిన నేపథ్యంలో స్థానిక హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశి కిరణ్ వీధి వ్యాపారులకు గొడుగులు అందించారు. స్థానిక మెహర్ బాబా ఆలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మొత్తం 70 మంది వీధి వ్యాపారులకు గొడుగులు అందజేశారు. కార్యక్రమంలో రఘుపతి నాయుడు, సంధ్య మానం శశి కిరణ్, శశికళ, బేకరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మక్కాజిపల్లిలో 104 సేవలు


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెనుకొండ రూరల్: వెంకటగిరిపాళ్యం, మక్కాజిపల్లి తాండాలో గురువారం 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా గ్రామంలో రోగులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 104 సిబ్బంది, వైద్య సిబ్బంది కృష్ణవేణి పాల్గొన్నారు.

టీడీపీని రాష్ట్రం నుంచే తరిమేద్దాం



రాజు కాలనీలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప. పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

గుడిబండ: ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయడం ద్వారా టీడీపీని రాష్ట్రం నుంచే తరిమేద్దామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ప్రజలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని రాజు కాలనీలో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి 58 నెలల్లో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో మంచి జరిగితేనే ఓటేయాలని అడిగిన దమ్మున్న నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేసి పార్టీలకతీతంగా నిరుపేదలకు లబ్ధి చేకూర్చడం జగనన్నకే దక్కిందన్నారు. పేదలు, మహిళలకు అన్ని వర్గాలకు మంచి చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అని కొనియాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మడకశిర కోట పైన వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరవేయాలని ఈరలక్కప్ప కోరారు. కార్యకర్తలు సమష్టిగా పని చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్ కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నాయకులు

బూదిపల్లికి చెందిన ప్రకాష్, రామలింగప్ప, మాధవరెడ్డి, ఈరప్పతోపాటు దాదాపు 20 టీడీపీ కుటుంబాలు గురువారం వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. వీరికి ఈరలక్కప్ప కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ జగనన్న పాలన నచ్చి టీడీపీ కార్యకర్తలు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. ప్రకాష్ మాట్లాడుతూ జగనన్నను మళ్లీ సీఎం చేయడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిబి శివకుమార్, సర్పంచ్ జీబీ కరుణాకర్, ఎంపీటీసీ సభ్యుడు పాతలింగప్ప, ఎస్టీసెల్ జాయింట్ సెక్రెటరీ గిరిదర్, నాయకులు లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదల జీవితాల్లో వెలుగులు


నరసాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ఉషశ్రీ చరణ్

పరిగి: జగనన్న పాలనతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపారని మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. గురువారం ఆమె కొత్తపల్లి, పి నరసాపురం, ముద్దిరెడ్డిపల్లి, బీరేపల్లి, ధనాపురం, శిరేకోళం, హొన్నంపల్లి, కొత్తనరసాపురం, జంగాలపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అయా గ్రామాల్లో ప్రజలు ఆమెకు పూల వర్షం కురిపిస్తూ ఆత్మీయ స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ నిరుపేదలతో పాటూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా జగనన్న పాలన సాగించారన్నారు. సంక్షేమంతో పాటూ అభివృద్ధికి పెద్ద పీట వేసిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీదేనన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి, ప్రజల ముంగిటకే సంక్షమ పథకాలను పారదర్శకంగా అందించారన్నారు. అవినీతి, లంచం అన్న మాటలే లేకుండా ప్రజలకు పథకాలు అందాయన్నారు. దేశం మొత్తం ఏపీ వైపు తొంగి చూసేలా జగనన్న ప్రభుత్వం సంక్షేమ రాజ్యాన్ని సృష్టించారని, ఇందుకు నిదర్శనాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి అఖండ మెజార్టీని గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత శ్రీచరణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీపీ సవిత ప్రభాకర్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు సరస్వతి, ప్రభాకర్, మంజునాథ్‌రెడ్డి, ఎంపీటీసీ గంగాదేవి, సచివాలయ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

సోమందేపల్లి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంతిగా చేసుకుందామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. గురువారం నాగినాయనిచెరువు, గుడిపల్లి, తుంగోడు, పత్తికుంటపల్లి, చాలకురు గ్రామాల్లో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సమన్వయంతో పనిచేసి పెనుకొండలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకట రత్నం, జెడ్పీటీసీ అశోక్, సర్పంచులు అంజినాయక్, నిర్మల, లలితా, గిరిజమ్మ, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నాగభూషణంరెడ్డి, సేవాదళ్ చైర్మన్ వేణు, రైతు విభాగం పార్లమెంట్ కార్యదర్శి జగదీష్, స్థానిక నాయకులు లక్ష్మీనరసప్ప, చంద్ర రెడ్డి, ప్రతాప్, అమర్, శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పూలపల్లకీలో ఊరేగిన లక్ష్మీనరసింహస్వామి


పూల పల్లకిలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి

రొళ్ల: మండల కేంద్రంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి పూల పల్లకీపై ఊరేగారు. ఉదయం నుంచి ఆలయంలో లక్ష్మీదేవి సమేత నరసింహస్వామి మూల విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. పట్టణ వాసులు, చుట్టు పక్కల గ్రామాల నుంచే గాక కర్ణాటక ప్రాంతం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. రాత్రి మేళతాళాలతో పురోహితులు ఆలయం చుట్టు స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రదక్షిణలు చేసి అనంతరం పల్లకీలో ఉంచారు. తర్వాత గ్రామ పురవీధుల గుండా పల్లకీని ఊరేగించారు. ఇదిలా ఉండగా రొళ్ల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఆలయ ఆవరణలో దేవత సంకీర్తన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసులు

పెనుకొండ: పెనుకొండ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వాల్మీకి శ్రీనివాసులు ఎన్నికయ్యారు. గురువారం జరిగిన నూతన బార్ అసోసియేషన్ ఎన్నికలకు పోలింగ్ ఆఫీసర్లుగా నాగరాజు, నవశివ శర్మ వ్యవహరించారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడిగా వాల్మీకి శ్రీనివాసులు, ప్రధానక కార్యదర్శిగా కురుబ అశ్వర్థనారాయణ, జాయింట్ సెక్రటరీగా జావీద్‌హుస్సేన్, లైబ్రరీ సెక్రటరీగా లీలారాణి, ట్రెజరర్‌గా విక్రాంత్‌నాయక్, కమిటీ సభ్యులుగా నాగిరెడ్డి, బాలాజీ, రంగనాథ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని పూలమాలలతో సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాట్లాడుతూ న్యాయవాదులకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

తల్లిదండ్రులను మించిన దైవం లేదు


తల్లిదండ్రులకు పాద పూజ చేస్తున్న విద్యార్థులు

హిందూపురం టౌన్: పట్టణంలోని విద్యారణ్య పాఠశాలలో గురువారం మాతాపితృ వందన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల చేత తల్లిదండ్రులకు శాస్త్రోక్తంగా పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి కార్యదర్శి గోవిందరాజులు మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులను మించి దైవం లేదన్నారు. తల్లిదండ్రులను కొలిచే కార్యక్రమాలు సమాజానికి చాలా అవసరమన్నారు. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం క్రిష్టప్ప, సమితి సభ్యులు రామ్మూర్తి, సుబ్రహ్మణ్యం, జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, సమితి అధ్యక్షుడు రత్నయ్య, సత్యనారాయణగుప్త, సదానందయ్య, శంకరప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

హిందూపురం అర్బన్: కర్ణాటక సరిహద్దు గ్రామం దేవరపల్లి వద్ద తోటలో నివాసం ఉంటున్న వృద్ధురాలు సంజీవమ్మపై గుర్తు తెలియని వ్యక్తులు గురువారం దాడి చేశారు. గమనించిన కుటుంబ సభ్యులు హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై ఆమెను ప్రశ్నించగా తనకు ఏదీ గుర్తులేదని చెబుతోంది. ఇదిలా ఉండగా ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బైక్ అపహరణ

మడకశిర: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ఆవరణంలో బుధవారం రాత్రి ద్విచక్రవాహనం చోరీకి గురైంది. వివరాలు..మండలంలో పనిచేసే ఓ ప్రభుత్వ ఉద్యోగి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించేందుకు బైక్‌పై వచ్చాడు. ఆస్పత్రిలోకి వెళ్లి వచ్చే లోపు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌ను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధుల సమావేశం

మడకశిర: పట్టణంలోని మారుతీనగర్‌లోని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థ ఈరలక్కప్ప స్వగృహంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మండలంలోని ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప తెలిపారు. పార్టీ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నవీన్ నిశ్చల్, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బోయ శాంతమ్మ, ఈరలక్కప్ప, పరిశీలకులు ప్రసాద్‌రెడ్డి, పోకల అశోక్ కుమార్ హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

గుడిబండ: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్ తెలిపారు. పార్టీ అధ్యక్షులు నవీన్‌నిశ్చల్, మడకశిర నియోజకవర్గ పరిశీలకుడు పోకుల అశోక్‌కుమార్, ఎన్నికల పరిశీలకులు ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఎస్ఎల్ ఈరలక్కప్ప, బోయ శాంతమ్మ హాజరవుతారన్నారు.

రొళ్ల: మండల కేంద్రం మడకశిర ప్రధాన రోడ్డులోని శ్రీలక్ష్మీ ప్యాలెస్ కల్యాణ మంటపంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు వైఎస్సార్‌సీపీ సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ తాలూకా బూత్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ నాగేంద్ర, మండల జేసీఎస్ కన్వీనర్లు లోకేష్, నాగేంద్ర తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఎన్నికల ప్రచారానికి తరలిరండి

చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండలం బాలంపల్లి నుంచి శుక్రవారం ప్రారంభమయ్యే వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎస్ దీపిక కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఉదయం 7 గంటలకు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్దకు చేరుకోవాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

కర్ణాటక మద్యం పట్టివేత

లేపాక్షి: కంచిసముద్రం వద్ద గురువారం మధ్యాహ్నం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి హెడ్ కానిస్టేబుల్ జనార్దన్ కర్ణాటక మద్యం పట్టుకున్నారు. నిందితుడు కలకత్తాకు చెందిన హరిందన్ గోష్ నుంచి 180 ఎంఎల్ 20 మద్యం ప్యాకెట్లు, 750 ఎంఎల్ ఒక బాటిల్, నాలుగు 375 ఎంఎల్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేసినట్లు డీటీ తెలిపారు.

రొళ్ళ: కె బ్యాడిగెర చెక్‌పోస్ట్ వద్ద గురువారం కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. నిందితుడి నుంచి మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

కర్ణాటక వాసికి తీవ్ర గాయాలు

మడకశిర రూరల్: అయ్యవారిపల్లి సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..పావగడ తాలాకా జోడిఅచ్చంపల్లికి చెందిన అశ్వత్థనారాయణ అయ్యవారిపల్లిలో కోళ్ల ఫారంలో పని చేసేవాడు. పని నిమిత్తం మడకశిరకు వచ్చిన అతడు టీవీఎస్‌పై అయ్యవారిపల్లికి బయలుదేరాడు. హిందూపురం వైపు వచ్చిన కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో సంకష్ట హర చతుర్థి

హిందూపురం: సంకష్టహర చతుర్థి పురస్కరించుకుని గురువారం రాత్రి వినాయక ఆలయాల్లో పూజలు ఘనంగా జరిగాయి. శ్రీనివాస నగర్, బెంగళూరురోడ్‌లోని గణపతి ఆలయంలో ఉదయం, సాయంత్రం మహాగణాధిపతికి పంచమృతాభిషేకాలు చేసి విశేషంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో గణపతి హోమం, పుష్పాలంకరణ, గరకతోపాటు కుడుముల హారాలు, ఆకుల తోరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు ఉదయం నుంచి ఉపవాస దీక్షలు చేసి రాత్రి ఆలయానికి చేరుకుని గణపతికి కుంకుమార్చనలు జరిపించారు.

వడ్డీ రాయితీ సద్వినియోగం చేసుకోండి

పెనుకొండ: ఆస్తిపన్నుపై వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ గురువారం పట్టణ ప్రజలకు సూచించారు. వడ్డీ రాయితీకి మరో 3 రోజులు మాత్రమే గడువు ఉందని తెలిపారు. పన్ను ఏకకాలంలో చెల్లించే వారికి ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇస్తోందని, ఆస్తి, కొళాయి, ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్నులను చెల్లించాలని కోరారు. సెలవు రోజుల్లో సైతం క్యాష్ కౌంటర్లలో పన్ను చెల్లించవచ్చని పేర్కొన్నారు.

గుప్త నిధుల తవ్వకాల ప్రాంతం పరిశీలన

సోమందేపల్లి: గుడిపల్లి సమీపంలో ఉన్న ముతోత్రాయ గుడి వద్ద గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని ఎస్ఐ విజయ్‌కుమార్ గురువారం పరిశీలించారు. రాళ్లు పెకలించి పూజలు జరిపినట్లు గుర్తించారు. గ్రామస్తులతో పోలీసులు వివరాలు సేకరించారు. గుప్తనిధుల వేటగాళ్లను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుడిబండ: కస్తూర్బా పాఠశాలలో 2024–25 సంవత్సరానికి గాను ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎమ్ లక్ష్మీ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఆరవ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లు చొప్పున ఖాళీగా ఉన్నాయన్నారు. విద్యార్థులు ఏప్రిల్ 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఉంటుందన్నారు. అనాథలు, మధ్యలో బడిమానేసిన పిల్లలతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ విద్యార్థినులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చౌడేశ్వరిదేవి విగ్రహ పునఃప్రతిష్ట

లేపాక్షి: చోళసముద్రంలో వెలిసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో గురువారం అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో సంకల్పం, గణపతి పూజ, స్వస్తి పుణ్యావాహచనం, నవగ్రహ పూజ, అగ్నిముఖ ప్రయోగం, గణపతి హోమం, వాస్తు హోమం, పూర్ణాహుతి హోమం చేపట్టారు. లేపాక్షి ఆలయం చైర్మన్ కరణం రమానందన్, ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్, ఎస్ఆర్ఐ కేశవమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగ్గురికి తీవ్రగాయాలు

గోరంట్ల: మల్లాపల్లి సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు....యర్రగారిపల్లికి చెందిన భాస్కర్ కియా అనుబంధ కంపెనీలో పని ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. మల్లాపల్లి సమీపంలో పాలసముద్రం గ్రామానికి చెందిన అనిల్‌కుమార్, అరవింద్ బైక్‌తో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఘటనలో ముగ్గురికీ తీవ్రగాయాలయ్యాయి. 108లో వారిని గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భాస్కర్, అనిల్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండటంతో హిందూపురం తీసుకెళ్లారు.